క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అమెరికా వైద్య బృందం

అనంతగిరి: మదన్‌పల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమెరికా నుంచి వచ్చిన సత్యసాయి భక్తులు, గ్లోబల్ ఫస్ట్ రెస్పాండ్ అనే సంస్థ ఆధ్వర్యంలో వైద్యులు విచ్చేసి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు 200మందిని పరీక్షించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వినయ్‌కుమార్, గ్రామ పెద్దలు సదానందరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు, మాధవరెడ్డి, సోమిరెడ్డి, సంగయ్య, రాములు, రామచంద్ర, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మైసమ్మ గడ్డ తండా, భోజన్నగడ్డ తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.90లక్షల నిధులు మంజూరయ్యాయి. శనివారం కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్ రెడ్డి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గిరిజన తండాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సింలునాయుడు, అంజిల్‌రెడ్డి, మల్లేశ్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

రైతు ధర్నాలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ధర్నాలో పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కందుకూరులో శనివారం నిర్వహించిన రైతు ధర్నాలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ చేపట్టిన రైతు ధర్నాలో నియోజకవర్గం నుంచి రైతులు, పార్టీ నాయకులతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొప్పుల మహేశ్‌రెడ్డి రైతు ధర్నాలో మాట్లాడారు. బీఆర్ఎస్ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. రైతులకు మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మోసం చేసిందని విమర్శించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య, సురేందర్, మాణిక్య, రవీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు తప్పనిసరి

దుద్యాల్: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన బూత్ లెవెల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు ఓటు నమోదుతో పాటు సవరణకు అవకాశం ఉందన్నారు. ఫారం-6తో కొత్త ఓటరు నమోదు, ఫారం-7తో జాబితాలో అభ్యంతరాలు మరియు ఫారం-8తో ఇంటి చిరునామా మార్పు, సవరణలు చేసుకోవాలన్నారు. నవంబర్ 9, 10వ తేదీలో కూడా ప్రత్యేక ఓటరు నమోదు డ్రైవ్ ఉంటుందని సూచించారు. అనంతరం బీఎల్ఓలకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవి కిశోర్, కుదురుమల్ల బీఎల్ఓ రాధా, హస్నాబాద్ బీఎల్ఓ కృష్ణవేణి, ఆలేడ్ బీఎల్ఓ రమేశ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దోమ: క్రీడలతో మానసికోల్లాసం పెరుగుతుందని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు రితికొరెడ్డి అన్నారు. శనివారం తిమ్మాయిపల్లి గ్రామంలో క్రికెట్ పోటీలను రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, శివకుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యాబద్దీన్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కుల్కచర్ల: ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఎర్రం యాదయ్య శుక్రవారం అనారోగ్య సమస్యతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇప్పాయిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు బాధిత కుటుంబానికి రూ. 3వేలు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, చిన్న వెంకటయ్య, సత్తయ్య, ఎర్రం శ్రీను, బోరింగ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

గుడిని కూల్చారు నిర్మాణం మరిచారు

- మధ్యలోనే నిలిచిపోయిన పనులు
- సేకరించిన విరాళం ఎండోమెంట్‌కు చెల్లింపు
- అదనపు నిధుల సేకరణకు నిర్వాహకుల ప్రయత్నం
- పట్టించుకోని దేవాదాయశాఖ అధికారులు



గర్భగుడి కోసం నిర్మించి మధ్యలోనే వదిలేసిన బేస్‌మెంట్

దౌల్తాబాద్: భక్తులతో కిటకిటలాడే దేవాలయం పాతబడింది. శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయాన్ని నిర్మించేందుకుగాను గుడిని కూల్చేశారు. తిరిగి పునఃర్‌నిర్మించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో నిత్యం పూజలందుకునే వేంకటేశ్వరస్వామి పూజలకు నోచుకోకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. శతాబ్దాల చరిత్ర కలిగిన వేంకటేశ్వరస్వామి ఆలయం పునఃర్‌నిర్మాణానికి నోచుకోవడంలేదు. మండల కేంద్రంలో పెద్దచెరువు కట్టపై ఆహ్లాదకరంగా ఉండే స్థలంలో ఎంతో చరిత్ర కలిగిన వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో పునఃనిర్మాణానికి భక్తులు దాదాపు రూ.12లక్షలు విరాళాలు సేకరించి దేవాదాయశాఖకు చెల్లించారు. ఈ దేవాలయ నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం రూ.50లక్షలు మంజూరయ్యాయి. ఆలయ నిర్మాణానికిగాను అప్పటి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. పనులు చేపట్టడానికి పాత కట్టడాలు కూల్చివేశారు. పాత దేవాలయం కూల్చి సుమారు రెండేళ్లకుపైగా గడుస్తున్నా పనులు మాత్రం పూర్తికావడంలేదు. పురాతన దేవాలయానికి సంబంధించిన స్తంభాలను తొలగించి ఎక్కడపడితే అక్కడ పడేశారు. భక్తులు,



ఆలయ స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతున్న సీఎం సోదరుడు, కడా అధికారి (ఫైల్)

స్థానికుల ఒత్తిడిమేరకు ఆలయ పనులు ప్రారంభించారు. గర్భగుడి నిర్మాణానికి బేస్‌మెంట్ వరకు నిర్మించి మధ్యలోనే వదిలేశారు. దేవాలయం చుట్టు పక్కల ప్రాంతం చెత్తాచెదారంతో నిండిపోవడంతో పాటు పాములు విష పురుగులకు నిలయంగా మారింది. ఇక్కడ ఫిబ్రవరిలో జాతర ఉత్సవాలు కూడా నిర్వహిస్తారు. ఈ ఏడాది దేవాలయం కూల్చడంతో ఉత్సవాలు అంతంతమాత్రంగానే ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నిధుల మంజూరుకు ప్రయత్నాలు...

ఆలయ నిర్మాణానికిగాను గత ప్రభుత్వం రూ.50లక్షలు మంజూరు చేసింది. మంజూరైన నిధులతో దేవాలయ నిర్మాణ పనులు పూర్తికాదని భావించారు. ప్రస్తుతం వారు ఇక్కడినుంచి గెలిచిన ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడంతో అదనపు నిధుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలను ఆలయ కమిటీ సభ్యులు చేస్తున్నారు. ఇప్పటికే సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మూడు రోజుల క్రితం కడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి దౌల్తాబాద్‌కు వెళ్లి దేవాలయాన్ని, అక్కడి పరిస్థితిని పరిశీలించారు. దీంతో వారు అదనపు నిధులకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలోనే ఆలయ పునఃనిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఈ విషయంలో ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రానున్న ఉత్సవాల వరకు ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీఐ శ్రీధర్‌రెడ్డి



చిట్లపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది

కొడంగల్ రూరల్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో, చిట్లపల్లి టోల్‌గేటు సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. వాహనదారులు లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలన్నారు. అనంతరం నెంబర్‌ప్లేట్ లేని 40వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట ఎస్‌ఐలు సత్యనారాయణ, రవిగౌడ్, రవూఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

పూడూరు: రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర పేర్కొన్నారు. శనివారం పూడూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. రైతులు తమ పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పూడూరు తహసీల్దార్ భరత్, సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

దుద్యాల్: ఆలేడ్ గ్రామంలో వీధి దీపాలు పగిలిపోవడంతో శనివారం కొత్త విద్యుత్ బల్బులు బిగించారు. ప్రతి సంవత్సరం దసరా పండుగకు ముందు గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు లేని వాటిని గుర్తించి బిగిస్తారని గ్రామస్తులు తెలిపారు.

వెంకటస్వామి జయంతి

దోమ: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో మహేశ్‌బాబు, ఎంపీఓ సోమలింగం కాకా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పర్యావేక్షకులు నరేందర్, ఏపీఓ దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా డిజిటల్ సర్వే



కొడంగల్: సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే జోరుగా కొనసాగుతోంది. శనివారం మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ సర్వే పనులను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం ప్రజల వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మ పాటలు పాడి అలరించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని పేర్కొన్నారు.



తాండూరు టౌన్: సింధు డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు



తాండూరులో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు స్వరూపరాణి



అనంతగిరి: బతుకమ్మతో విద్యార్థినులు, అధ్యాపకులు



పరిగి: అనంత పద్మనాభస్వామి మహిళా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సంబరాలు



దౌల్తాబాద్: బతుకమ్మతో మహిళలు చిన్నారులు

సమస్యలు పరిష్కరించాలని వినతి



అమిత్‌రంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజ్‌కుమార్, జర్నప్పలు

తాండూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్నప్పలు కోరారు. శనివారం మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలోని సీసీఐ ఫ్యాక్టరీలో పర్సనల్ విభాగం మేనేజర్ అమిత్‌రంజన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కంపెనీలో రిటైర్మెంట్ అయిన కార్మికులకు గ్రాట్యూటీని వెంటనే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వేతన సవరణ చట్టం ప్రకారం 400మంది కాంట్రాక్టు కార్మికులకు రోజువారి కూలి పెంచాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు.

కొనసాగుతున్న దుర్గామాత ఉత్సవాలు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలల్లో, ఆయా దేవాలయాల్లో దుర్గామాత ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి దూపదీప, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.



కొడంగల్ రూరల్: అమ్మవారిని దర్శించుకుంటున్న సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు



తాండూరు టౌన్: అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపానర్సింలు, తదితరులు



దౌల్తాబాద్: దుర్గామాత పూజలో భక్తులు



ధారూరు: అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరిస్తున్న పూజారి చెన్నబసవయ్యస్వామి



అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో చంద్రఘంటిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



దుద్యాల్: దుర్గమ్మకు విద్యుత్ కాంతులతో అలంకరణ

పిచికారీలో జాగ్రత్తలు తీసుకోవాలి



మర్పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ నీరజ

ధారూరు: క్రిమి సంహారక మందులు పిచికారీ చేయడంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల రైతు రుణమాఫీ నోడల్ అధికారి సంజురాథోడ్ పేర్కొన్నారు. గురుదోట్ల రైతు వేదికలో శనివారం నిర్వహించిన క్రిమి సంహారక మందుల వాడకం, పంటలపై స్ప్రే విధానంపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిచికారీ చేసేటప్పుడు నోటికి మాస్క్, చేతులకు గ్లౌసులు, మోకాళ్ల వరకు బూట్లు వేసుకుని క్రిమి సంహారక మందులు చల్లాలన్నారు. పురుగుల మందు డబ్బాలపై బ్లూ లేబుల్‌తో ఉంటే మధ్యస్థ పూరితమని, పసుపు రంగులో ఉంటే అత్యంత విషపూరితమని, ఎరుపు రంగులో ఉంటే చాల విషపూరితమని గుర్తించి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

మర్పల్లిలో..

మర్పల్లి: పత్తి, కంది ఇతర పంటలపై స్ప్రే చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మర్పల్లి క్లస్టర్ ఏఈఓ నీరజ సూచించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తలపై హెల్మెట్ ధరించాలని, ముఖానికి మాస్క్ వేసుకోవాలన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

పత్తి పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నీరజ తెలిపారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరి పంటలు ఎరుపు రంగుగా మారాయన్నారు. ఈ సందర్భంగా సస్యరక్షణ చర్యలు చేపట్టి పత్తి పంటను కాపాడుకోవాలని సూచించారు. పొలాల్లో నీరు చేరకుండా బోదెలు తీయాలన్నారు. పత్తి పంటను రసం పీల్చే పురుగుల నుంచి అసిఫేట్, ఇమిడాక్లోరైడ్ 1.5 మిల్లీ లీటర్ చొప్పున లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బంట్వారం: తాండూరు విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు కారణంగా కోట్‌పల్లి మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

సిద్దనొంపు ఆంజనేయస్వామికి పూజలు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి దేవాలయంలో 54వ శనివారం పురస్కరించుకొని అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, సింధూరలేపనం, ధూపం, దీపం, నైవేద్యం సమర్పిస్తూ మంగళ హారతులు ఇచ్చారు. హిందూవాహిని, ఆర్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ స్తోత్రం, లక్ష్మీ అష్టోత్తర శత నామ స్తోత్రం, లింగాష్టకం, హనుమాన్ చాలీసా మధ్యాహ్నం 12-30గంటల వరకు నిర్వహించారు. అనంతరం పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నారాయణరెడ్డికి శుభాకాంక్షలు

పెద్దేముల్: కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలోని ఆయన నివాసంలో శనివారం నాయకులు శాలువా కప్పి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు అంజయ్య, బాల్‌రెడ్డి, బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, ధారాసింగ్, గాజీపూర్ నారాయణరెడ్డి, లొంక నర్సిములు, మహేష్ కుమార్, మధుసూదన్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, మైవూస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దామగుండంలో బతుకమ్మ

పూడూరు/అనంతగిరి: నేవీ రాడార్ ఏర్పాటునకు వ్యతిరేకంగా ఆదివారం మండల పరిధిలోని దామగుండం క్షేత్రంలో బతుకమ్మ నిర్వహించనున్నట్లు పరిక్షరక్షణ వేధిక అధ్యక్షుడు వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేవీ రాడార్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో జరిగే పకృతి వైపరీత్యాలను ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, ప్రజాగాయకురాలు విమలక్కతో పాటు, వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు, జిల్లానాయకులు రానున్నారని తెలిపారు.